సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 6 । ఆగస్టు । 2025



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామివారి క్షేత్రంలో అన్నప్రసాద భవన నిర్మాణానికి ముదునూరి సతీష్ వర్మ, పుష్పవతి దంపతులు(ఉండ్రాజవరం) మంగళవారం రూ1,00,116 విరాళం సమర్పించారు.




భక్తుల పాలిట 'భయం'తులు!

శ్రీపాద శ్రీవల్లభ స్వామి వెలసిన పిఠాపురం పట్టణంలో.. ఇరుకు సందుల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతూండటంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు.

10లో..

1.78 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి మంగళవారం సాయంత్రం 1,78,415 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. 10.90 అడుగుల నీటి మట్టం నమోదైంది. డెల్టా కాలువలకు 14,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మహిళా విభాగం జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గీత



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత నియమితులయ్యారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఈ నియామకం చేపట్టారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆమె ఈ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ఇళ్ల స్థలాలకు జర్నలిస్టుల వినతి



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు నాగప్రసాద్ తదితరులు

అమలాపురం రూరల్: అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏపీయుడబ్ల్యూజే శాఖ అధ్వర్యంలో అమలాపురంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మండేల నాగప్రసాద్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు తమ సమస్యలపై ఆందోళన చేశారు. బిహార్ తరహాలో జర్నలిస్టులకు పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కోవిడ్‌లో చనిపోయిన పాత్రికేయులకు ఆర్థిక సాయం అందించాలని, జర్నలిస్టులు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఎల్రక్టానిక్ మీడియా అధ్యక్షుడు కోర్లపాటి ప్రదీప్, ఉమ్మడి తూర్పుగోదావరి మాజీ కార్యదర్శి సుంకరప్రసాద్, ప్రెస్‌క్లబ్ ప్రింట్ మీడియా అధ్యక్షుడు కొండేపూడి సత్య నారాయణ, మాజీ అధ్యక్షుడు రంబాల నాగ సత్య నారాయణ, అమలాపురం నియోజకవర్గ ఏపీయుడబ్ల్యూజే అధ్యక్షుడు అరిగెల రుద్ర శ్రీనివాస్‌రావు, నాయకులు నిమ్మకాయల సతీష్‌బాబు, పరసా సుబ్బారావు, పొట్టుపోతు నాగు, వట్టికూటి గోవింద్, ఆకుల రవితేజ, దొమ్మేటి వెంకట్, కాకిలేటి సూరిబాబు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర కోకో రైతుల సదస్సు

అంబాజీపేట: ఏపీ రాష్ట్ర కోకో రైతు సదస్సును బుధవారం మధ్యాహ్నం అంబాజీపేట కోప్రామర్చంట్ హాల్‌లో నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కోకో రైతు సంఘ నాయకులు తెలిపారు. ఈ సదస్సులో కోకో రైతులు ధరల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ఎఫ్‌పీఓలు ఏర్పాటు తదితర అంశాలపై చర్చిస్తారన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న అముడా చైర్మన్ స్వామినాయుడు, అధికారులు

అమలాపురం టౌన్: జిల్లాలో చాలా అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ అల్లాడ స్వామినాయుడు ఆ లే అవుట్ల యాజమానులకు సూచించారు. ఇందుకు అనధికార లే అవుట్ల క్రమబద్ధీరణ స్కీమ్‌ను (ఎల్ఆర్ఎస్) జిల్లాలోని రియల్టర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్థానిక అముడా కార్యాలయంలో జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు, ఇంజినీర్లతో అనధికార లేవుట్లపై మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో చైర్మన్ స్వామినాయుడు మాట్లాడారు. అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు తుది గడువు వచ్చే అక్టోబర్ 24వ తేదీ అన్నారు. అనధికార లే అవుట్లలో ప్లాట్‌లు కొనుగోలు చేసినవారు కూడా ఎస్ఆర్ఎస్ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అముడా ప్లానింగ్ ఆఫీసర్ ఎ.సత్యమూర్తి ఎస్ఆర్ఎస్ స్కీమ్‌పై, దానికి విధించిన తుది గడువు. దరఖాస్తులు చేసుకునే విధి విధానాలపై సర్వేయర్లు, ఇంజినీర్లకు అవగాహన కల్పించారు. అముడా అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి పి.ఉమా మహేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ చిట్టిబాబు ఎల్ఆర్ఎస్ నియమ నిబంధనలు వివరించారు.

ఉద్యోగులకు యాతనాలు



- ఉమ్మడి జిల్లాలో చిరుద్యోగులకు వేతన వెతలు
- వేతన, బిల్లు బకాయిలతో అవస్థలు
- అత్యవసర సిబ్బందికీ సమస్యలే
- ఉద్యోగ, ఉపాధ్యాయులూ బాధితులే
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు
- ఫోన్‌లను తిరిగి ఇచ్చేస్తున్న అంగన్‌వాడీలు

వేతనాల చెల్లింపు భారం అనుకోవడం సరికాదు



మానవ సమాజంలో సంపదను సృష్టించేది మానసిక, శారీరక శ్రమ చేసే శ్రామికులే. వారికి వేతనాలు రూపంలో ఖర్చు చేసేది భారంగా ప్రభుత్వం భావించకూడదు. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే స్థాయిలో వేతనాలను పెంచి, క్రమం తప్పకుండా చెల్లించాలి.

– చెక్కల రాజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ, కాకినాడ జిల్లా

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే సామాన్య ప్రజలకు, వారికి సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులు, సేవకులకూ భరోసా ఇచ్చేదిగా ఉండాలి. గెలవాలన్న తపనతో నోటికొచ్చిన హామీలిచ్చేసి, గెలిచాక ఆర్థిక సంక్షోభమంటూ లెక్కలేసుకోవడం ప్రజాస్వామ్యయుతమైన పాలన కానేకాదు. 2024 జూన్ 12న అధికారాన్ని చేపట్టిన కూటమి ప్రభుత్వం పాలన సామాన్యులు, చిరుద్యోగులను తీవ్ర యాతనకు గురి చేస్తోంది. వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వ ఉద్యోగులంటూ వాటిని ఎగవేస్తోంది. వేతనాలు ఇచ్చేటప్పుడు పూర్తి స్థాయి ఉద్యోగులు కాదంటూ కోతలు పెడుతోంది. ఇచ్చేది స్వల్ప వేతనమే అయినా దానిని కూడా నెలల తరబడి బకాయి పెడుతూండటంతో వివిధ శాఖల్లో పని చేస్తున్న చిరుద్యోగులు నానా అగచాట్లూ పడుతున్నారు. ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో నేరుగా ప్రజలకు ఫోన్ చేసి సిబ్బంది సేవలు సంతృప్తికరంగా ఉన్నాయా అని అడుగుతున్న ప్రభుత్వం.. సిబ్బందికి భారీగా బకాయిలపై మాత్రం నోరు మెదపడం లేదు.

అత్యవసర సేవకులకు అవస్థలు

అత్యవసర సేవలందించే 108, 104, 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను గతంలో అరబిందో సంస్థ నిర్వహించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. ఈ మార్పు క్రమంలో రెండు నెలల పాటు వేతనం, ఇంక్రిమెంట్లు ఆలస్యంగా అందజేశారు. వీరి వేతనాన్ని రూ.4 వేలు పెంచుతామని ఎన్నికల సమయంలో కూటమి హామీ ఇచ్చింది. ఆచరణకు వచ్చేసరికి 108 సిబ్బందికి రూ.500, 104 సిబ్బందికి రూ.1,500 తగ్గించి వేతనాలిస్తున్నారు. వాహనం బ్రేక్‌డౌన్ అయ్యినప్పుడు ఉద్యోగికి వేతనం తగ్గిస్తూనే సేవలు మాత్రం కొనసాగించినట్టు చూపుతున్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి 4 నెలలుగా వేతనాలు బకాయి పెట్టారు.

'డొక్క'లెండుతున్నాయ్

మధ్యాహ్న భోజన పథకానికి ఆంధ్రా అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు పెట్టామని గొప్పగా చెబుతున్న ప్రభుత్వం.. ఆ పథకం నిర్వాహకులను మాత్రం అనేక అవస్థలకు గురి చేస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,258 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 229 ఉన్నత పాఠశాలల్లో 62,464 మంది, కాకినాడ జిల్లాలో 1,285 ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు అప్పులు చేసి అన్నం పెడుతున్నారు. ప్రతి విద్యార్థికి మెనూ చార్జి కింద రూ.20 ఇవ్వాలని, వంట గ్యాస్ సిలిండర్, కూరగాయలను ప్రభుత్వమే ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకోని పరిస్థితి. వారికి ఇచ్చే రూ.3 వేల వేతనాన్ని కూడా రెండు నెలలకోసారి అందజేస్తున్నారు. మెనూ చార్జి బిల్లులను మార్చి నుంచి బకాయి పెట్టింది. పథకం నిర్వహణను ప్రైవేటు వారికి అప్పజెప్పిన ప్రాంతాల్లో కార్మికులకు రూ.3 వేలు కాకుండా రూ.1,500 మాత్రమే ఇస్తున్నారు. రౌతులపూడి, తుని, శంఖవరం, కోటనందూరు, తొండంగి, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది.

స్కూల్ ఆయాలకు ఆరు నెలలుగా..

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుతున్న ఆయాకు నెలకు కేవలం రూ.6 వేల గౌరవ వేతనమిస్తున్నారు. అది కూడా జనవరి నుంచి ఆరు నెలల పాటు బకాయి పెట్టారు. పాఠశాలకు ఒక్కరు చొప్పున కాకుండా పాఠశాల విస్తీర్ణం ప్రామాణికంగా ఆయాలను తీసుకోవాలని సంఘం కోరుతోంది.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు..

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎరియర్స్, డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్ల రూపాల్లో రూ.కోట్లలో బకాయిలున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల బదిలీ అయిన 1,500 మంది ఉపాధ్యాయులకు జూన్, జూలై నెలల వేతనాలు ఇప్పటికీ చెల్లించలేదు. స్కూల్ అసిస్టెంట్ సమాన క్యాడర్ బదిలీలు జూన్ 9తో, ఎస్జీటీ బదిలీలు జూన్ 14తో ముగిసినప్పటికీ సాంకేతిక సమస్యల సాకుతో వేతనాలు చెల్లించడం లేదు. డీఎస్సీ-98 మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ఉపాధ్యాయులు ఆందోళనలు చేసిన అనంతరం జూన్ నెల వేతనాన్ని ఇటీవల అందుకున్నారు.

ఇంకా..

సీఎంఆర్ ద్వారా రైతులు అమ్మిన రబీ ధాన్యానికి సైతం ప్రభుత్వం ఇంకా డబ్బు చెల్లించలేదు. తాము చేసిన పనులకు బిల్లులు చెల్లించాలంటూ జూలై 7న అమలాపురం కలెక్టరేట్ వద్ద కాంట్రాక్టర్లు ధర్నా చేశారు. పవన్ కల్యాణ్ పల్లె పండగ పేరుతో ఉపాధి హామీ పథకం నిధులతో రూ.170 కోట్ల పనులు చేయించగా ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదని వారు నిరసన తెలిపారు.



మొబైల్ ఫోన్లు వద్దంటూ తునిలో అంగన్‌వాడీ వర్కర్ల నిరసన (ఫైల్)

అంగన్‌వాడీ కార్యకర్తలకు బకాయిలు

అంగన్‌వాడీ కార్యకర్తలకు మార్చి నుంచి ఈవెంట్స్ బిల్లులు బకాయి పెట్టారు. ఈ ప్రభుత్వం వచ్చాక టీఏ, డీఏలు చిల్లిగవ్వ కూడా చెల్లించలేదు. తీవ్ర ఆందోళనల నేపథ్యంలో ఇటీవల గౌరవ వేతనాలు మాత్రం జమ చేసింది. మరోవైపు యాప్ యాతనలు పడలేమంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు రెండు రోజులుగా మొబైల్ ఫోన్లను ప్రభుత్వాధికారులకు వెనక్కి ఇచ్చేస్తున్నారు.

క్లాప్ మిత్రలు, పారిశుధ్య కార్మికులు

స్వచ్ఛ భారత్ మిషన్ అమలులో భాగంగా తడి, పొడి చెత్త సేకరించేందుకు 250 కుటుంబాలకు ఒకరు చొప్పున క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) మిత్రలను తీసుకున్నారు. గత ఏడాది నుంచి తమ జీతాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐలకు నగదు మినహాయించినప్పటికీ సుమారు రూ.50 లక్షలు జమ చేయలేదని క్లాప్ వాహన డ్రైవర్ల సంఘం ఆరోపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీల్లో ఉన్న సంపద సృష్టి కేంద్రాల్లో క్లాప్‌మిత్రలు రూ.6 వేల జీతానికి పని చేస్తున్నారు. తర్వాతి కాలంలో మిషన్ నుంచి నిధులు నిలిచిపోవడంతో వీరి జీతాల భారం పంచాయతీలపై పడింది. పంచాయతీల ఆర్థిక పరిస్థితులు బాగోలేక వీరి జీతాలు బకాయిలు పేరుకుపోతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని అత్యధిక పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్స్ (పారిశుధ్య కార్మికుల)కు 3 నెలలకు పైగా గౌరవ వేతనాలు బకాయిలున్నాయి.

సమయపాలన ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: జలవనరుల శాఖ ఇంజినీర్లు ముఖ ఆధారిత హాజరు నమోదుతో పాటు సమయ పాలన పాటిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇచ్చిన ఆదేశాల మేరకు జలవనరులు, డ్రైనేజీ విభాగపు ఇంజినీర్ల పనితీరుపై ఈఈ, డీఈ ఈ, సహా ఇంజినీర్లతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో జలవనులశాఖ పనులలో ఆశించిన పురోగతి లేదని ఉన్నతాధికారుల సమీక్షలో వెల్లడైన నేపథ్యంలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. డీఆర్ఓ కె.మాధవి ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల, ఎస్ఈ వెంకట స్వామి, డీఈలు వెంకటేశ్వరరావు డ్రైనేజీ విభాగం ఈఈ ఎంపీవీ కిషోర్ పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయ భూముల రీ సర్వే పూర్తి చేయాలి

అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన భూముల రీ సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, దేవదాయ, ధర్మాదాయ అధికారులను జేసీ నిషాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో దేవస్థాన భూముల సర్వేపై సమీక్షిస్తూ 895 ఎకరాలలో 139 ఎకరాలు దేవస్థానం ఆధీనంలోనే ఉందని, ఇప్పటివరకు 211 ఎకరాలలో సర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. నోటీసులు ఇచ్చి 15 రోజులలో ఆక్రమణదారులను ఖాళీ చేయించాలన్నారు. దేవస్థానం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి భూములకు అద్దెలు, లీజుల ధరలు నిర్ణయించాలన్నారు.

నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

అయినవిల్లి లో వేంచేసియున్న వరసిద్ధి వినాయక స్వామి ఈ నెల 27వ తేదీ నుంచి వినాయక చతుర్థి నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలని జేసీ నిషాంతి దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఉత్సవాల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. సెప్టెంబర్ 4 వరకు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వ హించాలన్నారు.

బాంబింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

మామిడికుదురు: పాశర్లపూడి–పాశర్లపూడిలంక గ్రామాల సరిహద్దులో ఓఎన్‌జీసీ క్షేత్రంలో డ్రిల్లింగ్ నిర్వహిస్తున్న సైటులో మంగళవారం బాంబింగ్ నిర్వహించారు. బాంబుల శబ్దానికి తమ ఇళ్ల బీటలు తీశాయంటూ స్థానిక శ్రీరామ్‌పేటవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను గ్రామ సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు దృష్టికి తీసుకు వెళ్లారు. మాజీ సర్పంచ్ అక్కడకు చేరుకుని ఓఎన్‌జీసీ అధికారులతో మాట్లాడారు. ముందస్తుగా ఏవిధమైన సమాచారం లేకుండా బాంబింగ్ ఎందుకు చేశారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల ఆందోళనతో ఓఎన్‌జీసీ అధికారులు బాంబింగ్‌ను నిలుపుదల చేశారు. ఈ–2003 నంబర్ రిగ్‌తో ఇక్కడ డ్రిల్లింగ్ నిర్వహించారు. డ్రిల్లింగ్ చివరి దశకు చేరుకున్న సమయంలో గత నెల 9వ తేదీన భారీ శబ్దంతో గ్యాస్ కిక్ ఇచ్చింది. దీంతో అయోమయానికి గురైన ఓఎన్‌జీసీ సిబ్బంది పరుగులు తీశారు. స్థానికుల తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో బాంబింగ్ నిర్వహించడంతో స్థానికులు భయపడ్డారు. ఎమ్మార్వో సునీల్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు ఏ విధమైన సమాచారం లేదన్నారు. దీనిపై పరిశీలన చేస్తున్నామని చెప్పారు.

పుష్కరాలకు అంచనాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: 2027లో రానున్న పుష్కరాలకు జిల్లాలో ఉన్న స్నాన ఘట్టాల మరమ్మతులు, నూతన స్నాన ఘట్టాల ఏర్పాటు, కల్పించాల్సిన మౌలిక వసతులపై నియోజకవర్గాల వారీగా అంచనాలను రూపొందించి సమర్పించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జలవనరుల శాఖ స్నాన ఘట్టాలు, స్నాన ఘట్టాల వద్దకు వెళ్లే అప్రోచ్ సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, తాత్కాలిక పిండ ప్రధాన షెడ్లు, పుష్కరనగర్ ఏర్పాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునే షెడ్లు, దైవ దర్శనాలకు, స్నాన ఘట్టాలకు వెళ్లే మార్గాలలో సైనింగ్ బోర్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నదీ తీర ప్రాంతంలో, ప్రముఖ దేవాలయాలలో దర్శన ఏర్పాట్లు, డార్మెట్రీలు, లైటింగ్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు.11 శాఖలు నిర్దేశిత పారామీటర్ల వారీగా ప్రతిపాదనలు రూపొందించాల్సి ఉంటుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్ఓ కె.మాధవి, పీ.శ్రీకర్, డీ.అఖిల,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి కలెక్టర్

15వ తేదీన జరిగే 79వ భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులకు సూచించారు మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా ఉండాలన్నారు. ఉత్తమంగా పనిచేస్తున్న ఉద్యోగుల పేర్లను ప్రతిపాదించాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు చంద్రగ్రహణం



- స్థానికేతర వివాదంతో 2,500 మంది భవితవ్యం ప్రశ్నార్థకం
- సర్కార్‌కు చెంపపెట్టులా కోర్టు ఉత్తర్వులు
- రెండో విడత కౌన్సెలింగ్‌పై సందిగ్ధత



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఇంజినీరింగ్ విద్యార్థుల భవితవ్యాన్ని కూటమి సర్కార్ గందరగోళంలోకి నెట్టేసింది. ఎంసెట్ కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు ప్రక్రియ అంతా పూర్తి చేసి, ఈ నెల 4వ తేదీ నుంచి ఇంజినీరింగ్ కాలేజీల్లో తరగతులు ప్రారంభించాల్సి ఉంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ, చంద్రబాబు సర్కార్ అనాలోచిత విధానాలతో మొదటికే మోసం వచ్చిందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఒక ఏడాది రాష్ట్రం వెలుపల చదివిన విద్యార్థులను సైతం స్థానికేతరులనే వివాదాన్ని రాజేసి, చివరకు కోర్టు నుంచి అక్షింతలు పడటంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అని విద్యార్థి లోకం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఫలితంగా రెండో విడత కౌన్సెలింగ్‌పై విద్యార్థుల్లో సందిగ్ధత కొనసాగుతోంది.

స్థానికేతర ముద్రపై వ్యతిరేకత

తెలంగాణలో ఇంటర్ చదివిన తమపై స్థానికేతరులనే ముద్ర వేయడాన్ని మొదటి నుంచి ఆంధ్రా విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నారు. తెలంగాణలో ఇంటర్ చదివి, ఏపీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించిన మన ప్రాంత విద్యార్థులను స్థానికేతరులుగా పేర్కొంటూ తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించకుండా ప్రభుత్వం దూరం పెట్టింది. కేవలం ఏపీలో చదువుకున్న వారికి మాత్రమే ఇంజినీరింగ్ సీట్లు కేటాయించింది. తమ మనోభావాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకున్న ఈ నిర్ణయంపై విద్యార్థులు కోర్టు మెట్లు ఎక్కారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. ఆంధ్రాలో పుట్టి, పెరిగి, ఇక్కడే నివాసం ఉంటూ ఆధార్ కార్డు కూడా ఇక్కడే ఉన్న విద్యార్థులను స్థానికేతరులుగా ఎలా పరిగణిస్తారంటూ చంద్రబాబు సర్కారుకు చీవాట్లు పెట్టిన సంగతి తెలిసిందే. సర్కార్ నిర్వాకంతో సీట్లు కోల్పోయిన విద్యార్థులందరినీ స్థానికులుగానే గుర్తించాలని కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టుగా నిలిచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కోరుకున్న కాలేజీలో సీటు గగనమే..

ఈ క్రమంలో రెండో విడత ఎంసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహిస్తారు.. స్థానికేతర వివాదంతో మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కోల్పోయిన విద్యార్థుల భవితవ్యం ఏమిటనే విషయమై సర్వత్రా ఆందోళన నెలకొంది. మొదటి విడత కౌన్సెలింగ్‌లో కూటమి సర్కార్ తీసుకువచ్చిన స్థానికేతర వివాదంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో సుమారు 2,500 మంది విద్యార్థులు సీట్లు కోల్పోయారని అంచనా. వీరి భవితవ్యంపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఏపీ ఈఏపీ సెట్‌లో ఉన్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఈ వివాదంతో తాము కోరుకున్న కాలేజీల్లో సీట్లు కోల్పోయారు. వారికి ఇప్పుడు కోరుకున్న కాలేజీల్లో సీట్లు దక్కడం గగనమేనని అంటున్నారు.

మొదటి విడత కౌన్సెలింగ్, సీట్ల కేటాయింపు ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యాయి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో కేటాయించిన కాలేజీల్లో జాయిన్ అయ్యేందుకు విద్యార్థులు కమిట్‌మెంట్ మాత్రమే ఇచ్చారు. అయితే, మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థుల్లో 80 శాతం మంది సహజంగానే మరింత మెరుగైన కాలేజీలు ఎంపిక చేసుకోవాలనే ఉద్దేశంతో రెండో విడత కౌన్సెలింగ్‌కు కూడా వెళ్తుంటారు. వాస్తవానికి ఉన్నత విద్యా మండలి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం రెండో విడత కౌన్సెలింగ్ కూడా ఇప్పటికే పూర్తి కావాల్సి ఉంది. ఇప్పుడు న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో ఇంజినీరింగ్ కోర్సులలో చేరాలనుకునే విద్యార్థులందరూ రెండో విడత కౌన్సెలింగ్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. మొదటి విడత కౌన్సెలింగ్‌లో చంద్రబాబు సర్కార్ నిర్వాకంతో సీట్లు రాక అన్యాయానికి గురైన విద్యార్థులకు మలి విడత కౌన్సెలింగ్‌లో ఏ రీతిన న్యాయం చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

మొదట్లోనే ప్రభుత్వం దూరదృష్టితో విద్యావేత్తలు, మేధావి వర్గం అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సరైన నిర్ణయం తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ సమస్య ఉత్పన్నమయ్యేదే కాదని పలువురు అంటున్నారు. సర్కార్ ఏకపక్ష వైఖరి వేలాది మంది విద్యార్థుల భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోందని విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు మండిపడుతున్నారు. తొలి విడత కౌన్సెలింగ్‌లో అన్యాయమైన విద్యార్థుల విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

న్యాయం చేయండి



ఏపీ విద్యార్థులు తెలంగాణలో ఇంటర్ చదివినప్పటికీ, వారి నివాసాలు, కుటుంబాలు ఆంధ్రాలోనే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ ఇంజినీరింగ్ కళాశాలల అడ్మిషన్లలో వారికి అవకాశం కల్పించాలి. వీరిని నాన్ లోకల్‌గా పరిగణించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం సరి కాదు. ఇటువంటి అడ్డంకులు కల్పించకూడదు. అలాగే, రెండో విడత కౌన్సెలింగ్ వెంటనే చేపట్టాలి.

– పి.సిద్ధు, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో..

ఇంజినీరింగ్ కాలేజీలు	31
ప్రభుత్వ	2
ప్రైవేటు	29
ఇంజినీరింగ్ సీట్లు	16,800
మొదటి విడత సీట్లు	11,430
ఎంసెట్‌లో ఉత్తీర్ణులైన వారు	
కాకినాడ జిల్లా	6,343
కోనసీమ జిల్లా	2,866
తూర్పు గోదావరి	6,011

క్లుప్తంగా

సారా విక్రేతపై పీడీ యాక్టు



గెద్దాడ రాఘవకు పీడీ యాక్టు నోటీసు అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ

సామర్లకోట: సారా విక్రయం చేస్తూ ఇప్పటి వరకు ఆరు పర్యాయాలు కేసు నమోదు అయిన పండ్రవాడ గ్రామానికి చెందిన గెద్దాడ రాఘవకు పీడీ యాక్టు నిర్బంధ ఉత్తర్వులు జారీ చేశామని కాకినాడ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.రామ మోహనరావు మంగళవారం తెలిపారు. ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుంచి ఆమెపై నాటు సారా విక్రయం కేసులు నమోదు చేశామన్నారు. ఎన్ని కేసులు పెట్టినా ఆమె సారా వ్యాపారం చేస్తున్న కారణంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాఘవపై కాకినాడ జిల్లా కలెక్టర్ పీడీ యాక్టు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ మేరకు ఆమెను మంగళవారం రాజమహేంద్రవరం ప్రత్యేక మహిళా కారాగారానికి అప్పగించామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవోదయంలో భాగంగా ఈ పీడీ యాక్టు నమోదు చేశామని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సారా తయారీ, అమ్మకాలకు దూరంగా ఉండాలని సీఐ హెచ్చరించారు.

పదిమందికి పదోన్నతులు



ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లకు, ముగ్గురు టైపిస్టులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఖాళీలు ఏర్పడగానే అర్హులైన ఉద్యోగులకు పదోన్నతిపై నియామకపు ఉత్తర్వులు వెంటనే జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహంతో విధులు నిర్వర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజాసేవలో ముందుంటూ పంచాయతీరాజ్ సంస్థలను ప్రగతి పథంలో నడిపించడంలో భాగస్వామ్యం వహించాలని కోరారు. జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణ రావు, ఉపముఖ్య కార్యనిర్వహణాధికారి జీఎస్ రామ్‌గోపాల్, ఏపీపీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్ పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి జూనియర్ టార్గెట్ బాల్ జట్ల ఎంపిక

చాగల్లు: చాగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 8,9 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టును బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్‌కార్డుతో హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

భక్తుల పాలిట భయంతులు!

- ప్రమాదం పునాదులపై కట్టడాలు
- ఇరుకు సందుల్లో బహుళ అంతస్తుల భవనాలు
- ఆటో కూడా వెళ్లలేని చోట అతి పెద్ద భవంతుల నిర్మాణం
- ఫైర్ ఇంజిన్, అంబులెన్సు కూడా వెళ్లలేని పరిస్థితి
- నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా అనుమతులు





పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థాన ఆలయం వీధిలో ఇరుకు సందుల్లో బహుళ అంతస్తుల భవనాలు

పిఠాపురం: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగైదు అంతస్తుల భవనాలు. 50కి పైగా గదులు. ఒకేసారి 250 నుంచి 300 మంది వరకు ఒకే భవనంలో నివసించే విధంగా నిర్మాణాలు. కాన్నీ భవనం చుట్టూ నిలబడడానికి కూడా స్థలాలు కరవు. నిబంధనలను తుంగలో తొక్కి అవినీతి అధికారులు ఇష్టారాజ్యంగా ఇచ్చిన అనుమతులతో పిఠాపురం పట్టణంలో బహుళ అంతస్తుల భవనాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కనీసం ఆటో కూడా వెళ్లడానికి వీలు లేని ఇరుకు సందుల్లో అతి పెద్ద భవనాలు నిర్మించేశారు. దీంతో ఏదైనా పెద్ద ప్రమాదం సంభవిస్తే అంబులెన్సు గాని ఫైర్ ఇంజిన్ గాని వెళ్లలేని పరిస్థితి ఉన్నా ఏ ఒక్క అధికారి ఇటు వైపు చూడకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయాందోళనల నడుమ ఉంటున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అవినీతితో అనుమతులు

అత్యంత ప్రసిద్ధిగాంచిన పిఠాపురం శ్రీపాద శ్రీ వల్లభ సంస్థానం ప్రతిష్టను దిగజార్చేలా కొంత మంది అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుండడం, అక్రమార్కులకు మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్‌లో గతంలో పని చేసిన ఒక అధికారి సహకరించడం భక్తులకు శాపంగా మారింది. కొన్నేళ్లుగా గుట్టు చప్పుడు కాకుండా సాగిన ఈ వ్యవహారం గతంలో నిర్మాణంలో ఉండగానే పక్కకు వాలిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాల వ్యవహారంతో బయటపడింది. పిఠాపురం మున్సిపల్ పరిధిలో కేవలం జి ప్లస్ టు భవనాలను మాత్రమే నిర్మించాల్సి ఉంది. అంతకుమించి మరొక అంతస్తు నిర్మించాలంటే అనేక రకాల అనుమతి పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. కానీ అవి ఏమీ లేకుండా అనుమతి పత్రాలకు బదులు «నోట్ల పత్రాల్లు సమర్పిస్తే నిబంధనలతో పని లేకుండా ఎన్ని అంతస్తులైనా ఎంచక్కా నిర్మించుకోవచ్చన్నది బహిరంగ రహస్యంగా మారింది. పిఠాపురం శ్రీపాద వల్లభ ఆలయం చుట్టుపక్కల కనీసం ఆటో కూడా వెళ్లలేని ఇరుకు వీధులలో ఐదంతస్తుల భవనాలను సైతం అవలీలగా నిర్మించడం వెనక భారీ ఎత్తున సొమ్ము చేతులు మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎటువంటి నిబంధనలు పాటించకుండా, జాగ్రత్తలు తీసుకోకుండా భారీ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడంతో అవి ఎప్పుడు ఏ ప్రమాదాన్ని తెచ్చిపెడతాయోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదం జరిగితే అంతే సంగతి

ఇరుకు సందులు చిన్న వీధుల్లో ఇష్టారాజ్యంగా నిర్మించిన పెద్ద భవనాల్లో ఏ ప్రమాదం జరిగినా ఒక్కరు కూడా తప్పించుకునే పరిస్థితి కనిపించదు. క్షతగాత్రులను తరలించడానికి కనీసం అంబులెన్సు కూడా వెళ్లలేని అత్యంత ప్రమాదకర పరిస్థితి ఇక్కడ నెలకొంది. ఏ భవనానికి అనుమతి ఇవ్వాలన్నా సేఫ్టీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంది. అక్కడ నివాసాలకు తగ్గట్టుగా పార్కింగ్ స్థలం ఉండాలి. కాని ఇక్కడ ఏ భవనం చూసినా గదులు పదుల సంఖ్యలో ఉంటే ఒక్క కారు కూడా పెట్టుకునే వీలు ఉండదు. శాశ్వత నివాసాలు కాకపోవడంతో యాత్రికులు కేవలం ఒకటి రెండు రోజులు మాత్రమే ఉండి వెళ్లి పోతుండడంతో పార్కింగ్ వేరే చోట పెట్టి భవనాలను లాడ్జిలుగా ఉపయోగిస్తు రూ.లక్షల్లో దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్లానింగ్ విభాగపు అధికారుల చేతివాటం పట్టణ పరిధిలోని మరిన్ని భవనాల బహుళ అంతస్తులను పరిశీలిస్తే అవగతమవుతుంది. ఎవరు ఎలా పోతే మాకేంటి మా చేయి తడుస్తుంది అన్న రీతిలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎటువంటి అనుకోని సంఘటన జరిగినా ఫైర్ ఇంజిన్, పోలీస్, ఇతర శాఖల అధికారులు ప్రవేశించలేని ఇరుకు వీధులలో అక్రమ భవనాలకు లభించిన అనుమతులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కంటే ముందుగానే మేల్కొంటే మంచిదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తి ముసుగులో భారీగా దోపిడీ

శ్రీపాద శ్రీ వల్లభ మహా సంస్థానంకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇతర రాష్ట్రాల నుంచి సుదూర ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది భక్తులు శ్రీపాద వల్లభ ఆలయానికి వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకున్న కొంతమంది అక్రమార్కులు నివాస గృహాలను అద్దె గృహాలు (లాడ్జిలు)గా మార్చివేసి భారీగా అద్దెలు వసూలు చేస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తుండడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో నిర్మాణంలో ఉన్న భారీ భవనం పక్కకు వాలిపోయి కూలిపోయే స్థితికి చేరడంతో ఆ భవనం పక్కనే ఉన్న మరో భవన యజమాని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు పక్కకు వాలిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్న భవన యజమానికి నోటీసులు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మించారని, ప్రస్తుత భవనం పక్కకు వాలిపోయినట్లు గుర్తించామని, ఆ భవనం పడిపోతే ఆస్తి, ప్రాణ నష్టం సంభవించే అవకాశం ఉందని నోటీసులో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన మూడవ అంతస్తును తొలగించి, భవన నిర్మాణ పటిష్టత విషయమై కాకినాడ జేఎన్టీయూ నుంచి నిర్మాణ పటిష్టత ధ్రువీకరణ పత్రాన్ని 15 రోజుల్లోగా అందజేయాలని నోటీసులో పేర్కొన్నారు. కానీ అధికారుల నోటీసులు పట్టించుకోకుండా ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారి సలహా మేరకు కేవలం పై అంతస్తులు మాత్రమే తొలగించి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

పిఠాపురం పట్టణంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకోవాలి. లేకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. పట్టణంలో నిబంధనలు పాటించకుండా చేపట్టిన నిర్మాణలపై దృష్టి సారిస్తున్నాం. అటువంటి భవనాలపై కోర్టు ద్వారా చర్యలు తీసుకుంటాం. – ఎస్.వల్లీప్రియ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారి, పిఠాపురం మున్సిపాలిటీ

కుతుకులూరులో గుడిసెల కూల్చివేత



కుతుకులూరులో గుడిసెలు కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



కుతుకులూరులో గుడిసెలు కూల్చి చదును చేసిన ప్రాంతం

బడుగులపై గెరిల్లా తరహా దాడులా : మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి : నిర్దాక్షిణ్యంగా దాడులు చేసి ఆస్తులను గృహాలను నేలమట్టం చేసి పైశాచికానందం పొందుతున్నారని మండలంలోని కుతుకులూరు ఎస్సీపేట నిర్వాసితులు వాపోతున్నారు. అనపర్తి మండలం కుతుకులూరు ఎస్సీ పేటలో నివసిస్తున్న పదిమందికి చెందిన గుడిసెలను సోమవారం మధ్యాహ్నం భారీగా పోలీసులను మోహరించి జేసీబీలతో కూల్చివేశారని వారు చెప్పారు. ఈ ఘటనపై బాధితులు మాట్లాడుతూ సుమారు 50 ఏళ్లుగా ఈ కాలనీలో నివసిస్తున్నామని, తమ ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో గుడిసెలను, పశువుల పాకలను వేసుకున్నామన్నారు. సోమవారం మధ్యాహ్నం పోలీసులు వచ్చి చెప్పా పెట్టకుండా అప్పటికప్పుడు జేసీబీలతో గుడిసెలను, పశువుల పాకలను కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మానవత్వం చూపకుండా తొలగించి తమను కావాలనే ఇబ్బందుల పాలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ సానుభూతిపరుల పక్కా భవనాల వైపు కనీసం కన్నెత్తి చూడలేదన్నారు. మారుమూల ఉండే ఆ ప్రదేశంలో విగ్రహాలు పెడతామని అంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేద బతుకులపై గెరిల్లా దాడులా?


విషయం తెలుసుకున్న అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం బాధితులను పరామర్శించారు. జరిగిన వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఏదో ఒక మూల పేదలపై విరుచుకుపడి వారి ఇళ్లు, ఆస్తులు ధ్వంసం చేయడం పరిపాటిగా మారిందన్నారు. అనపర్తి నియోజకవర్గంలో అయితే మరో అడుగు ముందుకేసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి డైరెక్షన్‌లో నిస్సహాయులైన బడుగుల జీవితాలపై గెరిల్లా తరహా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాత్రి సమయాల్లోను, తెల్లవారుజామున, సెలవు రోజుల్లోను వందలాది మంది పోలీసులను మోహరించి వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. వాటిలో దోమాడ తరహా ఆర్థిక పరమైన లాభాపేక్షతో చేసేవి కొన్నైతే బిక్కవోలు, కొమరిపాలెం, పందలపాక తదితర చోట్ల చేసినట్టు కక్షపూరితంగా కొన్ని చేస్తున్నారని ఆరోపించారు. దోమాడలో నిరుపేదల, కుతుకులూరులోని మారుమూల ఎస్సీపేటలో ప్రాణమున్న మనుషులను జీవచ్ఛవాలుగా మార్చి జీవం లేని విగ్రహాలు పెడతామని వింత వాదనను తీసుకువస్తున్నారని అన్నారు. ఈ కూల్చివేతల్లో పోలీసులతో పాటు మహిళా విభాగం నాయకురాలు కూడా ఉండి వారిని ప్రోత్సహిస్తున్నారంటే వారి రాక్షస మనస్తత్వం బయటపడుతుందన్నారు. అధికార పార్టీ నాయకులు పద్ధతి మార్చుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవడం తథ్యం అని డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ నాగిరెడ్డి ఉన్నారు.

వెదుళ్లపల్లి సొసైటీకి తాళం

- రుణాలు చెల్లించిన రైతుల ఆగ్రహం
- తమకు పాస్‌బుక్‌లు ఇవ్వాలని డిమాండ్
- సస్పెండైన సీఈవో లెటర్‌తో చైర్‌పర్సన్ ఎంపికపై అభ్యంతరం



వెదుళ్లపల్లి సొసైటీకి తాళం వేసిన రైతులు



వెదుళ్లపల్లి సొసైటీ చైర్‌పర్సన్ ఎంపికకు సస్పెండైన సీఈవో ఇచ్చిన లెటర్

సీతానగరం: సస్పెండైన సీఈవో సురేంద్ర లెటర్‌తో చైర్ పర్సన్ పదవి ఇవ్వడమేంటని, రుణాలు చెల్లించిన రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌ను బ్యాంక్ నుంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రైతులు వెదుళ్లపల్లి పీఏసీఎస్‌కు మంగళవారం తాళం వేశారు. వివరాల్లోకి వెళ్లితే పీఏసీఎస్‌లో రూ.64 లక్షలు గల్లంతయ్యాయని సాక్షి దినపత్రిక గత ఏడాది వెల్లడించింది. దాంతో సీఈవో సురేంద్ర, ఎరువుల సేల్స్ వుమెన్ భారతి, గుమస్తా పోశియ్యలను సస్పెండ్ చేశారు. రైతులు తీసుకున్న రుణాలు చెల్లించినా తప్పుడు రసీదులు ఇచ్చి అవినీతికి పాల్పడ్డారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రుణాలు చెల్లించిన రైతులకు పట్టాదారు పాస్‌బుక్‌లు విచారణ పేరుతో అందించకుండా నిలిపివేశారు. తాజాగా పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ఏర్పాటుపై రైతులు తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. లక్షలాది రూపాయల రుణాలు తీసుకుని ఓవర్ డ్యూలో ఉన్న కవల శ్రీనివాస్‌రావుకు సస్పెండైన సీఈవో సురేంద్ర లెటర్ ఇచ్చారని, అందులో శ్రీనివాస్ చెల్లించిన రుణ నగదు తానే వాడుకున్నానని, దానిని చెల్లిస్తానని లెటర్ ఇవ్వడంతో చైర్ పర్సన్ పదవి ఇవ్వడానికి విచారణాధికారి శివరామకృష్ణ సిద్ధపడ్డారని రైతులు మరిపిండి సోమరాజు, ఎ రఘురామ్, మద్దుకూరి సత్యనారాయణ, బొల్లి సత్యనారాయణ, సానపల్లి సత్యనారాయణ, కొత్తపల్లి దోసాలరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండైన సీఈవో తాము చెల్లించిన రుణాలకు ఇదే విధంగా లెటర్ ఇస్తానని విచారణాధికారుల ఎదుట చెప్పాడని, లెటర్ తీసుకుని మా పట్టాదారు పాస్‌బుక్‌లు బ్యాంక్ నుంచి తమకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం తేలే వరకు సొసైటీ తాళం తీయబోమని హెచ్చరించారు. రుణాలు చెల్లించిన రైతులకు న్యాయం చేయకుండా రుణాలు ఓవర్ డ్యూ అయిన వారికి లెటర్ ఆధారంగా సొసైటి చైర్ పర్సన్ పదవి ఇవ్వడం తగదని రైతులు అన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
ఒక కిలో	400

రేషన్ బియ్యం పట్టివేత

జగ్గంపేట: రూ.1,67,026 లక్షల విలువ గల 3.610 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. పెద్దాపురం మండలం గోరింటకు చెందిన కె బాలరాజు, ఎం.రవితేజ వ్యాన్‌లో బియ్యాన్ని ఏలేశ్వరం వైపు నుంచి గోకవరం వైపునకు తీసుకువెళుతుండగా జగ్గంపేట మండలం రాజపూడి వద్ద పట్టుకున్నామన్నారు.

ఫేక్ పీఎఫ్ చలానాల వివాదంలో నేడు ఆర్‌జేసీ విచారణ

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఇటీవల శానిటరీ కాంట్రాక్టర్ కనకదుర్గా మేన్‌పవర్ సర్వీసెస్ ఫేక్ పీఎఫ్ చలానాలు ఇచ్చినట్టు వచ్చిన ఆరోపణలపై బుధవారం రాజమహేంద్రవరం ఆర్‌జేసీ వీ త్రినాథ్‌రావు విచారణ జరుపనున్నారు. స్థానికంగా సంచలనం రేకెత్తించిన ఈ వ్యవహారంలో శాఖాపరమైన విచారణకు దేవదాయశాఖ కమిషనర్ కే రామచంద్రమోహన్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇంకా అందని పారిశుధ్య సిబ్బంది జీతాలు

దేవస్థానంలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 350 మంది సిబ్బందికి జూన్, జూలై నెల జీతాలు అందక ఆందోళన చెందుతున్నారు. గత శానిటరీ కాంట్రాక్టర్ మార్చి, ఏప్రిల్, మే నెలలకు ఫేక్ పీఎఫ్ చలానాలు ఇచ్చాడన్న కారణంగా జూన్ నుంచి ఆ కాంట్రాక్టర్‌ను తొలగించారు. వీరికి జీతాలు దేవస్థానంలోని మేక్స్ సెక్యూరిటీ సంస్థ ద్వారా చెల్లించేందుకు గాను దేవదాయశాఖ కమిషనర్‌కు ఫైలు పంపించారు. శుక్రవారం దేవస్థానానికి విచ్చేసిన కమిషనర్ రామచంద్రమోహన్‌ను సిబ్బంది కలిసి తమ జీతాల గురించి వినతి పత్రం సమర్పించారు. రెండ్రోజుల్లో జీతాలు చెల్లించేలా ఆదేశాలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇది జరిగి నాలుగు రోజులైనా ఇంకా ఆదేశాలు రాకపోవడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ఉత్సాహంగా హాకీ పోటీలు



పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ మధ్య జరుగుతున్న మ్యాచ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ 15వ జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీలు మంగళవారం డీఎస్‌ఏ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 11–0 స్కోర్‌తో ఉత్తరాఖండ్, ఢిల్లీ, తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్ 3–3 స్కోర్‌తో డ్రా కాగా, ఛండీఘర్, మధ్యప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 5–0 స్కోర్‌తో మధ్యప్రదేశ్ విజయం సాధించాయి. హర్యానా, బెంగాల్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 7–1 స్కోర్‌తోను, కర్ణాటక, జార్ఖండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో జార్ఖండ్ 2–0 స్కోర్‌తోను, ఆంధ్రప్రదేశ్, ఒడిశా మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 3–1 స్కోర్‌తో గెలుపొందాయి. మంగళవారం నిర్వహించిన మ్యాచ్‌లను రాష్ట్ర హాకీ సంఘ సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు పర్యవేక్షించారు.

నిందితులకు రెండేళ్ల జైలు

అనపర్తి : ఇంట్లోకి చొరబడి దోపిడీకి పాల్పడిన నిందితులకు అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి మజ్జి వంశీకృష్ణ రెండేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.6వేలు చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. మండలంలోని లక్ష్మీ నరసాపురం గ్రామానికి చెందిన కలిదిండి వెంకట విజయలక్ష్మీ కాంతమ్మ అలియాస్ లక్ష్మి 2015 నవంబర్ 20న రాత్రి తన ఇంట్లో టీవీ చూస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి కత్తితో బెదిరించి కాళ్లు చేతులు కట్టి ఆమె ఒంటిపై ఉన్న సుమారు రూ.2.60లక్షల విలువైన 30 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించి పరారయ్యారు. అప్పటి అదనపు ఎస్ఐ, సీఐ ఎస్.రాంబాబు నేతృత్వంలో కేసు నమోదు చేసి ఆరుగురిని అరెస్టు చేసి బంగారాన్ని రికవరీ చేశారు. నిందితులకు శిక్షపడడంలో ఏపీపీలు సిద్దార్ద్, మహాలక్ష్మి వాదనలు వినిపించగా సీఐ వీఎల్‌వీకే సుమంత్, ఎస్సై ఎల్ శ్రీను నాయక్ కేసును పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

శంఖవరం: కత్తిపూడి కాకినాడ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలయ్యాయి. అన్నవరం పోలీసుల వివరాల ప్రకారం రౌతులపూడి మండలం గిడజాంకి చెందిన టి.ప్రవీణ్, జె విజయ్ కాకినాడ వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై గిడజాం వస్తుండగా సత్తమ్మతల్లి ఆలయం సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు అన్నవరం ఎస్సై జి.హరిబాబు తెలిపారు.

కన్నుల పండువగా వెంకన్న పవిత్రోత్సవాలు

రెండోరోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు



వాడపల్లి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు మహా స్నపనము చేస్తున్న పండితులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు కన్నుల పండువగా నిర్వహించారు. దేవదాయ – ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనము, ప్రోక్షణ, పవిత్ర ప్రతిష్ఠ ప్రధాన హోమాలు, అష్టకలశారాధన, మహాస్నపనము, నీరాజన మంత్రపుష్పాలు, సాయంత్రం స్వస్తివచనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు దేవస్థానం తరపున డీసీ అండ్ ఈఓ చక్రధరరావు పట్టు వస్త్రాలను అందజేశారు. వేదపండితులు, అర్చకులు వేద మంత్రాలతో ఆలయ ప్రాంగణం శోభిల్లింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

ఉద్యోగులూ ఐక్యంగా ముందుకు సాగుదాం



సమావేశంలో మాట్లాడుతున్న బాపూజీ

రామచంద్రపురం: రాష్ట్రంలో ప్రభుత్వం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు 13 లక్షల మంది ఉన్నారని వీరందరికీ 25 వేల కోట్ల రూపాయలు కూటమి ప్రభుత్వం చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ ఆరోపించారు. ఉద్యోగుల హక్కులు బాధ్యతలు తెలియజేసేందుకు, వారిని పోరాటంలో కార్యోన్ముఖులను చేసేందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ పిలుపు మేరకు ఉద్యోగులను ఐక్యం చేసేందుకు ఉద్యోగులారా రండి.!.. టీ... తాగుతూ... మాట్లాడకుందాం.. పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు బాపూజీ అన్నారు. అందులో భాగంగా రామచంద్రపురం తాలూకా కమిటీ అధ్యక్షుడు జి. శ్రీ మన్నారాయణ అధ్యక్షతన పట్టణంలో ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాపూజీ మాట్లాడుతూ ఉద్యోగులందరికీ నాలుగు డీఏలు, బకాయిలు ఉన్నాయని, ఐఆర్ ప్రకటించలేదని, సరండర్ లీవుల బకాయిలు చెల్లించడం లేదని, ఐదు సంవత్సరాలు దాటిన నేటికీ పీఆర్‌సీ ఏర్పాటు చేయలేదని బాపూజీ వాపోయారు. ఉద్యోగుల సమస్యలపై ఇతర సంఘాలు పోరాడటం లేదని, అందుకే ఏపీజీఏ కోనసీమ జిల్లా ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీ నుంచి అన్ని ప్రభుత్వ ఉద్యోగులలో చొచ్చుకుపోయేందుకు ఈ వినూత్న కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి ఇవ్వాల్సిన బకాయిలు ఎంత చెల్లించాలో నిర్ధారించాలని, బకాయి డబ్బులు ఎంత ఇవ్వాలో ఉద్యోగి సర్వీస్ రిజిస్టర్ (ఎస్ఆర్)లో నమోదు చేయాలని, ఉద్యోగి కోరుకున్న ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఉంటే ఇండ్ల స్థలంగా ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేట్ ప్రెసిడెంట్ కె.సుబ్బలక్ష్మి, కార్యదర్శి పైడిమల్ల సత్తిబాబు, పంపన విష్ణుమూర్తి, కరుణమ్మ, చీకట్ల వీరాంజనేయులు, సత్యవతి, దుర్గమ్మ, దుర్గ, శ్రీనివాస్, సత్తిబాబు పాల్గొన్నారు.

బలిగొన్న గోతులు

- తలకు తీవ్ర గాయాలై యువకుడి మృతి

పెరవలి: నిడదవోలు–నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గోతుల వల్ల ఓ యువకుడు మృతిచెందాడు. ఉండ్రాజవరానికి చెందిన ఉచ్చుల వెంకన్న (27) ఈ నెల 4వ తేదీ రాత్రి పెరవలి మండలంలోని కాపవరం బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా అదే గ్రామంలో రోడ్డుపై ఏర్పడిన గోతులతో మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గోతుల వల్ల ఏర్పడిన రాళ్ల దెబ్బలతోనే మృతిచెందాడని వెంకన్న బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూల్యాంకన పుస్తకాల సరఫరా



దివాన్‌చెరువు నుంచి మండల కేంద్రాలకు వ్యాన్‌ల ద్వారా వెళ్తున్న మూల్యాంకన పుస్తకాలు

రాజానగరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు 17,90,115 మూల్యాంకన పుస్తకాలు అవసరం కాగా ఇంతవరకు 12,06,563 పుస్తకాలు వచ్చాయని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తక కార్యాలయ మేనేజర్ పి.సురేష్ తెలిపారు. దివాన్‌చెరువులోని కార్యాలయానికి చేరిన ఈ పుస్తకాలను ఉమ్మడి జిల్లాలోని 64 మండలాల్లో ఇప్పటికే 48 మండలాలకు సరఫరా చేశామన్నారు. ఒకటి, రెండు రోజులలో మిగిలిన వాటికి కూడా పంపిణీ చేస్తామన్నారు.